
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శ్రీలక్ష్మీకృతి కలగ (సికింద్రాబాద్) శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 3,61,255 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 11,400 క్యూసెక్కులు వదిలారు.

5న సామర్లకోటకు సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్ 5వ తేదీన సామర్లకోట రానున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. సామర్లకోట ఈటీసీ జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. -8లో▸

న్యూస్‌రీల్

ఎన్.రామేశ్వరం మొగకి మోక్షం



మొగలో ఇసుక మేటలను తొలగించడంతో సముద్రంలోకి వడివడిగా వెళ్తున్న ముంపు నీరు

అల్లవరం: గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలోని వాసాలతిప్ప, లోయర్ కౌశిక మేజర్ డ్రెయిన్లు, పంచ నది మీడియం డ్రెయిన్ సముద్రంలో కలిసే కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరం మొగ తెరచుకుంది. కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఈ విషయం తెలిపారు. బంగాళాఖాతంలో అలల కారణంగా ఏటా ఇసుక మేటలతో ఈ మొగ మూసుకుపోవడం పరిపాటిగా మారింది. దీనివలన అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోని సుమారు 35 వేల ఎకరాల్లో పంటలు ముంపు బారిన పడుతున్నాయి. దీనిపై ఇరిగేషన్, జిల్లా యంత్రాంగం స్పందించడంతో మొగలో పూడికతీతకు సీఎస్ఆర్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశామని కలెక్టర్ తెలిపారు. వారం రోజులుగా మొగలో పూడికతీత పనులు శరవేగంగా నిర్వహించి, శనివారం తెరిచామని చెప్పారు. దీంతో ఎగువన నిలిచిపోయిన ముంపు నీరు మొగ గుండా సముద్రంలోకి వడివడిగా చేరుతోందని, ముంపు సమస్య తీరుతుందని తెలిపారు. పూడికతీత పనులు రెండు రోజుల్లో పూర్తవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.

బాలబాలాజీకి రూ.1.62 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి వేకువజాము నుంచే భారీగా తరలివచ్చిన భక్తులు పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు సమర్పించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1.62 లక్షల ఆదాయం వచ్చింది. 3,098 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 2,264 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.మాధవి, చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు పర్యవేక్షించారు.

మినీ జాబ్ మేళాకు విశేష స్పందన

అమలాపురం రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యాన నేషనల్ కెరీర్ సర్వీసెస్ శనివారం నిర్వహించిన మినీ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాలో పాల్గొన్న రెండు 2 కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు అవగాహన కల్పించారు. 316 మంది నిరుద్యోగులు హాజరు కాగా, 121 మంది తదుపరి దశకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు.

రేపటి స్పందనకు సెలవు

అమలాపురం రూరల్: గాంధీ జయంతి సెలవు కారణంగా కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరగదని అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

4 నుంచి మండల స్థాయి స్పందన

అమలాపురం రూరల్: మండల స్థాయి స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల అక్టోబర్ నెల షెడ్యూల్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్టోబర్ 4న అయినవిల్లి, 6న రాయవరం, 11న మండపేట, 13న ఐ.పోలవరం, 18న రావులపాలెం, 20న కె.గంగవరం, 25న అల్లవరం, 27న ఆత్రేయపురం ఎంపీడీఓ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. వీటిని ఆయా మండలాల పరిధిలోని అర్జీదారులు వినియోగించుకోవాలని కోరారు.

ఆరోగ్యానికి.. సర్కారు రక్ష

- జిల్లాలో మొదలైన జగనన్న ఆరోగ్య సురక్ష
- తొలి రోజు 22 వైద్య శిబిరాలు
- బారులు తీరిన రోగులు
- శిబిరాలు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు



రామచంద్రపురంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి వేణు



మలికిపురం మండలం మేడిచర్లపాలెం శిబిరాన్ని పరిశీలిస్తున్న రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా

సాక్షి, అమలాపురం: పేదల వైద్యానికి పట్టం కట్టే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, మండలాల్లోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ శిబిరాలు నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులు వైద్య సేవల కోసం పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనతతో ఇబ్బంది పడుతున్న వారు ఈ శిబిరాల వద్దకు అధికంగా వచ్చారు. వైద్య శిబిరాలను జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలో తొలి రోజు 22 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో మండలాల్లో 20, అర్బన్ ప్రాంతాల్లో రెండు నిర్వహించారు. ఈ శిబిరాల ద్వారా తొలి రోజు 8,668 మందికి వైద్య సేవలు అందించారు.

ఈ శిబిరాల్లో వివిధ రకాల రోగాలకు చికిత్స అందించేందుకు వీలుగా ప్రత్యేక వైద్య నిపుణులతో పాటు పీహెచ్‌సీ వైద్యులతో సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. ఈసీజీతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు, కళ్లజోళ్లు.. ఇలా అన్ని రకాల ప్రయోజనాలూ కలిగించేలా ఈ శిబిరాలను పక్కా ప్రణాళికతో నిర్వహించారు. వివిధ రోగాలతో ఇబ్బందులు పడుతున్న వారిని వలంటీర్లు, ఆశా వర్కర్లు దగ్గరుండి శిబిరాలకు తీసుకుని వెళ్లారు. బాధితులను వారి రోగాన్ని బట్టి నిపుణులైన వైద్యుల వద్దకు అక్కడున్న సహాయకులు తీసుకుని వెళ్లి పరీక్షలు చేయించారు. వారి సలహా మేరకు ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. ఉన్నత వైద్యం, శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫారసు చేశారు.

శిబిరాల వారీగా వైద్య సేవలు పొందినవారు

మండపేట అర్బన్	714
రాయవరం	626
ముమ్మిడివరం	562
రావులపాలెం	531
మామిడికుదురు	495
ద్రాక్షారామ	469
ఐ.పోలవరం	452
కొత్తపేట	445
ఆలమూరు	422
మలికిపురం	411
అమలాపురం	405
అయినవిల్లి	372
రామచంద్రపురం అర్బన్	326
అంబాజీపేట	306
పి.గన్నవరం	300
ద్వారపూడి	291
అల్లవరం	290
రాజోలు	288
ఆత్రేయపురం	276
కాట్రేనికోన	264
సఖినేటిపల్లి	228
ఉప్పలగుప్తం	195



అయినవిల్లి పెదపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

శిబిరాలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

- రామచంద్రపురం పట్టణం నాలుగో వార్డు, రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. స్వయంగా ఆయన కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.
- రావులపాలెం, ఆత్రేయపురాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. కొత్తపేట మండలం మోడేకుర్రులో వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సేవలు అందుతున్న తీరుతెన్నులు అడిగి తెలుసుకున్నారు.
- మలికిపురం మండలం మేడిచర్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కూడా సందర్శించారు. ఇదే నియోజకవర్గం సఖినేటిపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కూడా ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. శిబిరాల వద్దకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వారికి రోగాలు అడిగి తెలుసుకుని, అందుకు తగిన వైద్య పరీక్షలు చేశారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి మందులు అందజేశారో ఆరా తీశారు.
- మండపేట అర్బన్ హెల్త్ సెంటర్, మండలంలోని ద్వారపూడి సచివాలయం-2 వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. టోకెన్ల ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించారు.
- ముమ్మిడివరం మండలం కొత్తలంకలో వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రారంభించారు.
- అయినవిల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. అంబాజీపేట, పి.గన్నవరంలో నిర్వహించిన శిబిరాలను ఆయన పరిశీలించారు.
- అల్లవరం మండలం బోడసకుర్రు-2లో సుమారు 290 వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఈవూరి ప్రశాంత్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి దుర్గారావుదొర పరిశీలించారు.

నిపుణులైన వైద్యులున్నారు



రక్తపోటు, గ్యాస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాను. ఇంతకు ముందు బయటి వైద్యుల వద్ద చూపించుకునే వాడిని. ఇప్పుడు అందుబాటులో నిపుణులైన వైద్యులు ఉండటంతో మంచి చికిత్స అందింది. అందుబాటులో ఇంతమంది వైద్యులను ఉంచడం చాలా మంచి విషయం. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు.

– గెద్దం బాలాజీదాస్, సోంపల్లి, రాజోలు మండలం

ఉచితంగా పరీక్షలు చేశారు



నేడు ఆటో డ్రైవర్‌ను. అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మాకు సమీపంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఇక్కడే పరీక్షలు చేయడం చాలా సంతోషంగా ఉంది. డబ్బులు కలిసి వస్తున్నాయి. నాకు ఈసీజీ, షుగర్‌తో పాటు ఇతర రక్త పరీక్షలు ఉచితంగా చేశారు.

– వాసంశెట్టి వెంకన్న, అంబాజీపేట

నాలుగేళ్లుగా రూ.వేలు ఖర్చు



నాకు నాలుగేళ్లుగా కాళ్లు, కీళ్ల నొప్పులు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యంతో పాటు మందులు తీసుకుంటే నెలకు రూ.1,500 అవుతోంది. ఇప్పుడు మా ఊళ్లోనే ఉచిత వైద్యం అందించారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– అరధాని ధనలక్ష్మి, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

నాడు రోత.. నేడు మోతా?

- నాటి కాపు ఉద్యమంలో కంచాలు కొట్టిన వారిపై వేధింపులు
- సెక్షన్ 341 కింద కేసులు పెట్టిన చంద్రబాబు సర్కార్
- ఇప్పుడు కంచాల మోతకు లోకేష్ పిలుపుపై విమర్శలు
- టీడీపీ ద్వంద్వనీతిపై సర్వత్రా విమర్శలు



నాడు కాపు ఉద్యమంలో భాగంగా అమలాపురంలో కంచాలు కొడుతున్న నేతలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు' అన్నట్టు టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. వందల కోట్ల రూపాయల స్కిల్ స్కామ్‌లో అరెస్టయిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు 21 రోజులుగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్నారు. అటువంటి చంద్రబాబుకు సంఘీభావంగా కంచాలు కొడుతూ ప్రజాశబ్దం వినిపించాలంటూ.. ఆయన తనయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇచ్చిన పిలుపు నగుబాటుకు గురవుతోంది. శనివారం రాత్రి ఏడు గంటల నుంచి ఐదు నిమిషాల పాటు కంచాలు, గరిటెలు, వాహనాల హారన్లు, అవేవీ అందుబాటులో లేకపోతే విజిల్స్‌తోనైనా ప్రజాశబ్దం చేయాలని చేసిన ట్వీట్ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చర్చనీయాంశమైంది. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో మరోలా ప్రవర్తించడం టీడీపీ నేతలకు పరిపాటని పరిశీలకులు ఎద్దేవా చేస్తున్నారు. పార్టీ అధినేత కటకటాలపాలవడంతో దిక్కుతోచని తెలుగు తమ్ముళ్లు తీవ్ర నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గోదావరి జిల్లాలు బలమైనవిగా భావించే పరిస్థితులు టీడీపీకి ఉండేవి. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ జనరంజక పాలనతో ఇప్పుడు టీడీపీ ఉనికి కోసం తంటాలు పడుతోంది. చంద్రబాబు జైలులో ఉన్నా ప్రజల సంగతి అటుంచితే.. పార్టీ నేతల కనీస స్పందన కూడా కొరవడిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు గగ్గోలు పెట్టడం బహిరంగ రహస్యమే.

ఇదేం వైఖరి?

చంద్రబాబు తరహాలోనే ఆ పార్టీ నేతలు రెండు నాల్కల ధోరణి అనుసరిస్తున్నారు. తాము చేస్తే ఒప్పు ఇతరులు చేస్తే తప్పు అనే టీడీపీ నేతల తీరును ప్రజలు గర్హిస్తున్నారు. 2016లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కాపు ఉద్యమం ప్రధానంగా నాటి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉధృతంగా సాగింది. ఆ క్రమంలో జనవరి 31న తుని రైలు దహనం సంఘటన జరిగింది. చంద్రబాబు సర్కారు తెరవెనుక నడిపిన కుతంత్రం వల్లనే ఈ సంఘటన జరిగిందనే ఆరోపణలు అప్పట్లోనే వినిపించాయి. ముద్రగడ పద్మనాభం సహా మహిళలని కూడా చూడకుండా ఆ కుటుంబంపై టీడీపీ సర్కార్ దమనకాండకు ఒడిగట్టింది. దీనిపై కాపు సామాజిక వర్గీయులు శాంతియుత పంథాలో బాబు ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన తెలిపారు. కంచాలు, పళ్లాలు, ప్లేట్లపై గరిటెలతో దరువు వేస్తూ 'కాపుల ఆకలి కేకలు' అంటూ నినదించారు. శాంతియుతంగా ఇళ్ల వద్ద, రోడ్డుకు ఇరువైపులా కూర్చుని కంచాలపై దరువు వేసిన వారిపై చంద్రబాబు ప్రభుత్వం కేసులు బనాయించింది. మహిళలు, చిన్నారులు అని కూడా చూడకుండా అందరిపైనా సెక్షన్ 341 కింద కేసులు పెట్టింది. సుమారు 400 కేసులు పెట్టింది. ఈ కేసుల ప్రహసనం 2016 జనవరి నుంచి 2017 మార్చి వరకూ కొనసాగింది.

కేసులు ఎత్తివేసిన జగన్

అక్రమ కేసులు ఎత్తేయాలని కాపు సామాజికవర్గ నేతలు, యువత వేడుకున్నా చంద్రబాబు సర్కార్ కనికరించ లేదు. చివరకు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దమనసు చాటుకున్నారు. కాపు ఉద్యమం సందర్భంలో గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులన్నింటినీ ఎత్తివేశారు. నాడు ఉద్యమంలో భాగంగా కంచాలపై శబ్దాలు చేస్తేనే అక్రమ కేసులు పెట్టి, ఇప్పుడు అవినీతితో జైలుపాలైన చంద్రబాబుకు మద్దతుగా కంచాలు, ప్లేట్లతో ప్రజాశబ్దం చేయమంటూ లోకేష్ ట్వీట్ చేయడం సిగ్గుచేటని వివిధ పక్షాలు ఆక్షేపిస్తున్నాయి. అప్పుడు ఆ సామాజికవర్గం న్యాయమైన డిమాండ్ కోసం ఆందోళన చేస్తే అక్రమ కేసులతో వేధించి.. ఇప్పుడు అదే పద్ధతిలో చంద్రబాబుకు సంఘీభావం తెలియజేయాలనడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని అంటున్నారు.

వేధించిన వారే కంచాలు కొట్టమంటే ఎలా?



శాంతియుతంగా కంచం శబ్దాలు చేస్తూ ఆందోళన చేస్తే చంద్రబాబు ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టింది. మహిళలని కూడా చూడకుండా వేధించింది. ఎవరి ఇంటి వద్ద వారు కంచాలతో చప్పుడు చేస్తే పెద్ద నేరం చేసినట్టు పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పింది. ఇప్పుడు అవినీతి కేసులో జైలులో ఉన్న చంద్రబాబు కోసం కంచాలతో దరువు వేయాలని లోకేష్ పిలుపు ఇవ్వడం సిగ్గుచేటు. స్కిల్ కేసులో జైలులో ఉన్న చంద్రబాబుకు ప్రజలు ఎలా మద్దతిస్తారు?

– అడ్డగర్ల వరలక్ష్మి, పి.గన్నవరం

లోకేష్ పిలుపు విస్మయంగా ఉంది



ఎవరింటి వద్ద వారు పిల్లాపాపలతో కంచాలు, ప్లేట్లపై చప్పుడు చేస్తే నాడు కేసులు పెట్టారు. ఇళ్లకు వచ్చి పోలీసులు చాలా ఇబ్బందులకు గురి చేశారు. నేడు వందల కోట్ల రూపాయల అవినీతి కేసులో చంద్రబాబు జైలులో ఉన్నారు. ఇప్పుడు కంచాలు కొట్టండని లోకేష్ కోరడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని అక్రమ కేసులు ఎత్తివేసి మేలు చేశారు.

– నూదా గణపతి, అమలాపురం

సేవల్లో రెడ్‌క్రాస్ ముందుండాలి

అమలాపురం రూరల్: విపత్తుల వేళ బాధితుల రక్షణ, ఉపశమనానికి మానవతా దృక్పథంతో విశేష సేవలందించడంలో రెడ్‌క్రాస్ సంస్థ ముందుండాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రకృతి విపత్తులు, గోదావరి వరదలు, అగ్ని ప్రమాదాలు సంభవించిన వెంటనే ఘటనా స్థలాలకు చేరుకుని ఉపశమన చర్యలు వేగవంతం చేయాలని సభ్యులకు సూచించారు. స్వచ్ఛందంగా సహాయపడాలనేది ఇండియన్ రెడ్‌క్రాస్ విధానమన్నారు. స్థానికంగా రెడ్‌క్రాస్ కార్యాలయం ఏర్పాటుకు భవనాన్ని అప్పగించామని, ఇందులో పైన కార్యాలయం, కింద బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలని సూచించారు. పలివెలలోని రెడ్‌క్రాస్ స్థలానికి సరిహద్దులు ఏర్పాటు చేస్తామని, అక్కడ కూడా బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు యోచిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, కార్యదర్శి పీఎస్ శర్మ, వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

మహాప్రస్థాన వాహన దాతలకు అభినందనలు

ఐ.పోలవరం మండలంలో మహాప్రస్థానం వాహనాన్ని దాతలు పి.కాశీవిశ్వనాథరాజు, చిరుకూరి కృష్ణరాజు సమకూర్చారు. వారిని కలెక్టర్ హిమాన్షు శుక్లా తన చాంబర్‌లో అభినందించారు. అంతిమ సంస్కారాల్లో సహాయపడటానికి మించిన సహకారం ఈ భూమి మీద లేదని అన్నారు.

సృజనాత్మక ప్రాజెక్టులు రూపొందించాలి

అమలాపురం రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలకు బలం చేకూర్చేలా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని అంబాజీపేట కొబ్బరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త వి.అనూష అన్నారు. 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టుల రూపకల్పనలో భాగంగా అమలాపురం డివిజన్ పరిధిలోని సైన్స్ ఉపాధ్యాయులకు శనివారం ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించారు. సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో జిల్లా సైన్స్ అధికారి గింజాల వీర వెంకట సత్య సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనూష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజం ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపే ప్రాజెక్టులను రూపొందించాలని సూచించారు.

జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, జిల్లా విద్యార్థుల ప్రతిభ జాతీయ స్థాయిలో ప్రతిబింబించేలా ప్రాజెక్టులు రూపొందించాలని అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మను విహారి కూడా ప్రసంగించారు. సమావేశంలో స్కూల్ ప్రిన్సిపాల్ దేవి, జిల్లా సైన్స్ అకడమిక్ కో ఆర్డినేటర్ పీవీ బ్రహ్మానందం, డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, సమగ్ర శిక్షా సీఎంఓ వి.సుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏఎంఓ పి.రాంబాబు, ఏపీఓ డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంఈఓ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు. తరగతుల్లో పాల్గొన్న సైన్స్ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు

అమలాపురం రూరల్: జిల్లాలోని కళాకారులు గుర్తింపు కార్డుల కోసం అక్టోబర్ ఐదో తేదీ లోగా తమ వివరాలను పంపించాలని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరు, పుట్టిన తేదీ, బ్లడ్ గ్రూప్, కళారూపం, అనుభవం, ఆధార్ నంబర్, చిరునామా వివరాలతో ఏ4 కాగితంపై స్పష్టంగా నమోదు చేసి, ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సెకండ్ ఫ్లోర్‌లోని తమ కార్యాలయానికి పంపించాలని సూచించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


ప్రమాదంలో నుజ్జయిన కారు

రాజానగరం: అసలే మద్యం మత్తులో ఉన్నారు.. ఆపై అతి వేగం.. రాంగ్ రూటులో ప్రయాణం.. ఫలితంగా ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. జాతీయ రహదారిపై స్థానిక బైపాస్ రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తుని మండలం హంసవరానికి చెందిన సాహెట్టి గణేష్ (29), రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన ఉడత సాయి (22) బైక్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. ఏడీబీ రోడ్డు నుంచి వారు జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలోకి మళ్లాల్సి ఉంది. కానీ మద్యం మత్తులో ఉన్న వారికి ఏది ఏ రూటో తెలియలేదో ఏమో! రాంగ్ రూటులో రాజమహేంద్రవరం నుంచి వచ్చే రోడ్డు పైకి బైకును పోనిచ్చారు. ఈ క్రమంలో డివైడర్‌ను ఆనుకుని కొద్ది దూరం వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న కారు.. వారిని తప్పించబోయి, ఢీకొని రోడ్డుకు అడ్డంగా దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బైక్ బోల్తా పడింది. బైక్ నడుపుతున్న గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయి మృతి చెందాడు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రాజానగరం పోలీసులు తెలిపారు.

హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ పి.జగదీశ్ తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను అధికారులకు వివరించారు. రాజానగరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. ఇలాగే జిల్లాలో పలుచోట్ల హైవేపై జరుగుతున్న ప్రమాదాల్లో చాలామంది నిత్యం మృత్యువాత పడుతున్నారని ఎస్పీ గమనించారు. రాజానగరం వద్ద హైవేపై ప్రమాద ప్రదేశాన్ని సందర్శించి, ఇక్కడి లోపాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ, జాతీయ రహదారిపై రోజూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, మరికొందరు గాయపడుతున్నారని అన్నారు. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడానికి నేషనల్ హైవే అథారిటీతో సంప్రదించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్ హెచ్చరిక బోర్డులు పెంచాలని సంబంధిత అధికారులకు ఎస్పీ సూచించారు. కార్యక్రజుమంలో డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్, బొమ్మూరు సీఐ ఆర్.విజయ్ కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

5న సామర్లకోటకు సీఎం జగన్


విలేకర్లతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- జగనన్న లే అవుట్ ఇళ్లు ప్రారంభం
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు వెల్లడి

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్ 5వ తేదీన సామర్లకోట రానున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. సామర్లకోట ఈటీసీ జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. అక్కడ ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, పార్కులను ప్రారంభిస్తారని తెలిపారు. జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారులతో ముచ్చటిస్తారని అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దొరబాబు మాట్లాడారు. విజయవాడ నుంచి సామర్లకోట – పెద్దాపురం రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సమీపాన ప్రైవేటు లే అవుట్‌లో ఏర్పాటు చేసే హెలిపాడ్‌కు చేరుకునే సీఎం జగన్.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జగనన్న కాలనీకి చేరుకుంటారని వివరించారు. జగనన్న కాలనీ సందర్శన అనంతరం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా సామర్లకోట వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దొరబాబు పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరో 15 రోజుల్లో ఇంటింటా జగనే కావాలి కార్యక్రమం ప్రారంభమవుతుందని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ, సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పి.సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ పాల్గొన్నారు.

సత్యదేవుని భక్తులకు

- కార్తికం నాటికి అందుబాటులోకి..
- ఆలయం చుట్టూ ఒకే ఎత్తున ఆవరణ
- ఈఓ చంద్రశేఖర్ ఆజాద్

కొత్త క్యూ కాంప్లెక్స్


అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందీ పడకుండా స్వామివారిని దర్శించేందుకు వీలుగా కొత్త క్యూ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. దీనిని వచ్చే కార్తిక మాసం నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. రత్నగిరిపై పలు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, రూ.800 వ్రత మండపాల మీద స్వామివారి ఆలయానికి దగ్గరలో.. నూతన రూ.2 వేల వ్రత మండపం వెనుక 150 అడుగుల పొడవు, 19 అడుగుల వెడల్పున విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించనున్నామని తెలిపారు. గతంలో స్వామివారి వంటశాల షెడ్డు నిర్మాణానికి టెండర్ పిలిచామని, అయితే దీని నిర్మాణానికి దాత ముందుకు వచ్చారని చెప్పారు. అందువలన వంటశాలకు కేటాయించిన మొత్తాన్ని విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తామని అన్నారు. సగం షెడ్డు నిర్మాణానికి ఈ మొత్తం సరిపోతుందని, మిగిలిన భాగం నిర్మాణానికి టెండర్ పిలుస్తామని వివరించారు. భక్తుల క్యూ షెడ్డు ఏసీ చేయిస్తామని, దీనివలన స్వామి వారి దర్శనం ఆలస్యమైనా భక్తులకు ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ క్యూ షెడ్డులో భక్తులు కూర్చునేందుకు కూడా అక్కడక్కడ బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీరు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం సత్యదేవుని ఆలయానికి ఉత్తరం వైపు మండపం శ్లాబ్ ఎత్తు, ఆలయం వెలుపల శ్లాబ్ కన్నా చాలా ఎత్తుగా ఉందని, ఇది వాస్తు విరుద్ధమని ఈఓ తెలిపారు. అందువలన ఈ శ్లాబ్‌ను రెండడుగుల మేర తగ్గించి, ఆలయం చుట్టూ ఒకే ఎత్తులో శ్లాబ్ ఉండేలా చేస్తామని వివరించారు. ఓల్డ్ సీఆర్ఓ వెనుక 30 మీటర్ల వెడల్పు, 400 మీటర్ల పొడవున బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లతో పిలిచిన టెండర్‌కు కమిషనర్ ఆమోదం తెలిపారని చెప్పారు. త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణం ప్రారంభించి, కార్తికం నాటికి పూర్తి చేస్తామని వివరించారు. ఇటీవల కూల్చివేసిన 30 వీఐపీ సత్రం వ్యర్థాలు మూడు రోజుల్లో తరలించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఈఓ ఆదేశించారు. ఈ స్థలంలో రూ.1.99 కోట్లతో 180 అడుగుల పొడవు, 150 అడుగుల వెడల్పున షెడ్డు నిర్మాణానికి సికింద్రాబాద్‌కు చెందిన లారెల్స్ ల్యాబ్ ప్రతినిధులు ఇప్పటికే శంకుస్థాపన చేశారన్నారు. వ్యర్థాలను తొలగించి, స్థలం చదును చేసి, అప్పగించిన వెంటనే షెడ్డు నిర్మాణం ప్రారంభిస్తారని ఈఓ తెలిపారు. సత్యగిరిపై 138 గదులతో నిర్మిస్తున్న శివసదన్ సత్రం పార్కింగ్ స్థలంలో కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులు చురుకుగా జరుగుతున్నాయని, మరో నాలుగు రోజుల్లో పూర్తవుతాయని ఈఓ ఆజాద్ తెలిపారు. ఇంజినీరింగ్ ఈఈ నరసింహరెడ్డి, డీఈ రాంబాబు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.


శివసదన్ సత్రం పార్కింగ్ స్థలంలో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులు

భీమేశ్వరునికి రూ.15.62 లక్షల ఆదాయం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా రూ.15,62,881 ఆదాయం సమకూరింది. ఈఓ పితాని తారకేశ్వరరావు శనివారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. ఈ ఏడాది జూన్ 15 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ ఈ ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలరాజారామ్ ప్రసాద్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు జరిగింది.

తమ్ముడి మృతి తట్టుకోలేక అక్క ఆత్మహత్య

కాకినాడ క్రైం: ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కొవ్వూరు రోడ్డుకు చెందిన గెద్దం భవానీ(33)కి కొన్నేళ్ల క్రితం ఆనంద్‌తో వివాహమైంది. వారికి ఓ కుమార్తె. భవానీ సోదరుడు మణికంఠ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. మూడు నెలల క్రితం తాను పని చేస్తున్న భవనం పై నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి అతడు మరణించాడు. అప్పటి నుంచీ తమ్ముడి మృతిని తట్టుకోలేక భవాని మనోవేదనకు గురైంది. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కాకినాడ క్రైం: నగరానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఫ్రేజరుపేటకు చెందిన పొన్నాడ దుర్గారావు (48) పెయింటర్‌గా పని చేస్తూండేవాడు. పెద మార్కెట్‌లోని ఓ సందులో ఒంటిపై గాయాలతో శనివారం విగత జీవిగా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని పరిశీలించగా, అప్పటికే దుర్గారావు మృతి చెందాడు. దాడి కారణంగా మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానితులను విచారిస్తున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి.. భక్తజన వాహిని..

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. సుమారు 35 వేలు మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల వ్రతం ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.30,61,492 ఆదాయం సమకూరింది.


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 4న శంకుస్థాపన

మధురపూడి: కోరుకొండ మండలం రాజవరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు ఈ నెల 4న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఈ విషయం తెలిపారు. రాజవరంలో యూనిట్ నిర్మించ తలపెట్టిన ప్రదేశాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యాన జిల్లాలో యూనిట్లు అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో రూ.4.45 కోట్ల సిడ్బీ ఆర్థిక సహాయంతో ఈ యూనిట్ ఏర్పాటవుతుందని వివరించారు. కలెక్టర్ వెంట, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, ఆర్డీఓ చైత్ర వర్షిణి, కోరుకొండ తహసీల్దార్ పి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

హర్షకుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్: కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఆ పార్టీ రాష్ట్ర నేతలపై మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ చేసిన ఆరోపణలను జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. అమలాపురంలోని దక్షిణామూర్తి వీధిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా సమావేశం హర్షకుమార్ తీరుపై ధ్వజమెత్తింది. తక్షణమే ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధిష్టానాన్ని డిమాండ్ చేసింది. రాజమహేంద్రవరంలో హర్షకుమార్.. మీడియాతో చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడి, ఆ పార్టీ కోసం పాకులాడుతున్నట్లు కనిపించిందని ప్రభాకరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలు కేవీపీ రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి వంటి వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం హర్షకుమార్‌కు తగదని సమావేశం స్పష్టం చేసింది. హర్షకుమార్‌కు ఎప్పుడూ నెగెటివ్ ఆలోచనలు తప్ప పాజిటివ్ ఆలోచనలు ఉండవని విమర్శించారు. వేరే పార్టీలోకి వెళ్లాలంటే జిల్లా పార్టీలో ఎవ్వరికీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గంటి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ పరీక్షల్లో రమ్యశ్రీకి 18వ ర్యాంకు

అమలాపురం టౌన్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సీఎంఏ-2023 పరీక్షల్లో అమలాపురానికి చెందిన అడ్డగర్ల రమ్యశ్రీ జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు సాధించింది. దేశ వ్యాప్తంగా వేలాదిగా విద్యార్థులు హాజరైన ఈ పరీక్షల్లో అతి తక్కువ మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో బీకాం చదివిన రమ్యశ్రీ గుంటూరులో సీఎంఏ శిక్షణ పొందింది. జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన రమ్యశ్రీని గుంటూరు శ్రీమేధా అకాడమీ డైరెక్టర్ కేఎన్‌టీ కిషోర్ శనివారం అభినందించారు. రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. రమ్యశ్రీని ఎస్‌కేబీఆర్ కళాశాల అధ్యాపకులతో పాటు వివిధ విద్యా సంస్థల యాజమాన్య ప్రతినిధులు కూడా అభినందించారు.


రమ్యశ్రీని అభినందిస్తున్న దృశ్యం

మహిళ మృతదేహం లభ్యం

నల్లజర్ల: భర్తతో గొడవ పడి అనంతపల్లి వద్ద పోలవరం కాలువలో దూకిన కస్తూరి (24) మృతదేహం శనివారం శింగరాజుపాలెం శివారులో లభ్యమైందని ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఆమె ఆచూకీ కోసం ఎన్‌డీఆర్ఎఫ్ దళాలతో పాటు గజ ఈతగాళ్లు పోలవరం కాలువలో గాలించారన్నారు. కస్తూరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించామని చెప్పారు.